క్లుప్తంగా

ఉరకలెత్తిన ఉత్సాహం


పిఠాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

పిఠాపురం: స్థానిక వైఎస్సార్ సీపీ మండల అనుబంధ సంఘాల సభ్యుల ప్రమాణ స్వీకారం పిఠాపురంలో అట్టహాసంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఆధ్వర్యంలో భారీ మోటారుసైకిళ్ల ర్యాలీ నిర్వహించగా స్థానికులు ఘన స్వాగతం పలికారు. అనంతరం నూతనంగా నియమితులైన సభ్యులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొప్పన శివనాథ్, మండల పార్టీ అధ్యక్షుడు జవ్వాది నాయుడు, కొత్తపల్లి రమణబాబ్జి పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల తనిఖీ


మద్యం దుకాణంలో తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ డీఎం ప్రసాద్

పిఠాపురం: చేబ్రోలులో మంగళవారం మద్యం దుఖాణాలను ఎక్సైజ్ డీఎం ప్రసాద్ తనిఖీ చేశారు. మద్యం దుకాణాలలో రికార్డులు పరిశీలించిన ఆయన స్టాకు వివరాలు సక్రమంగా ఉన్నాయా లేదా అనే అంశంపై తనిఖీ చేశారు. అమ్మకాలు ఎలా జరుగుతున్నాయని ఆరా తీశారు. మద్యం అమ్మకాల్లో ఎక్కడా అక్రమాలకు తావు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులకు సూచించారు.

పట్టణంలో జాతీయ ఐక్యత ర్యాలీ


సామర్లకోటలో ర్యాలీ చేసిన ఉపాధ్యాయులు

సామర్లకోట: జాతీయ ఏక్తా దివస్ సందర్భంగా మంగళవారం సాయంత్రం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్లో హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు ఐక్యత ప్రతిజ్ఞ చేసి, ర్యాలీ నిర్వహించారు. దేశ సమైక్యతకు పటేల్ చేసిన సేవలను హెచ్ఎం వివరించారు. విద్యార్థులు మానవహారం చేశారు. ఆయా కార్యక్రమాల్లో పీడీ తాళ్లూరి వైకుంఠం, ఉపాధ్యాయులు వి.రాజు జి.గోవిందు, జె.అరుణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై ప్రకటన బోర్డు


రైల్వే స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన బోర్డు

సామర్లకోట: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రతిఒక్కరూ మరుగుదొడ్లను ఉపయోగించుకోవాలంటూ ప్రకటన బోర్డును స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కేవీ గిరి, చీఫ్ కమర్షియల్ ఇన్స్పెక్టర్ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

ఇంటి స్థలం ఆక్రమణపై ఫిర్యాదు


మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన లబ్ధిదారు

సామర్లకోట: ఈటీసీ లేఆవుట్ జగనన్న కాలనీలో ఇంటి స్థలం ఆక్రమణకు గురైనట్టు లబ్ధిదారు మంగళవారం మున్సిపల్ కమిషనర్ జె.రామారావుకు ఫిర్యాదు చేశారు. కుమ్మర వీధికి చెందిన కారపల్లి సత్యవేణి అద్దె ఇంటిలో నివసిస్తుండడంతో, ఆమెకు జగనన్న కాలనీలో సీతారామ కాలనీ వైపు ఇంటి స్థలం కేటాయించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇల్లు నిర్మించుకోలేదు. ఆమెకు కేటాయించిన స్థలం సమీపంలో ఉన్న ఇంటి యజమాని.. తన స్థలానికి ప్రహరీ కట్టి, ఆక్రమించుకున్నట్టు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం స్పందనలో జిల్లా కలెక్టరుకూ ఫిర్యాదు చేసినట్టు ఆమె విలేకర్లకు చెప్పారు.


గౌరీదేవి పూజలు చేసిన దృశ్యం


వాయినాలు తీసుకున్న ముత్తైదువులు


సామర్లకోట గోదావరి కాలువ వద్ద గౌరీదేవి పూజలు చేస్తున్న మహిళలు


కట్టమూరులోని గౌరీదేవి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళ

సంప్రదాయబద్ధంగా అట్లతద్దె

- గౌరీదేవికి పూజలు చేసిన మహిళలు
- ముత్తైదువులకు అట్ల వాయినాలు
- ఉయ్యాల ఆటలు.. చెరువుల వద్ద పూజలు

కొత్తపల్లి: అట్లతద్ది తెలుగు వారి ముఖ్యమైన పండగలలో ఒకటి. ఈ పండగ బహళ తదియ నాడు మహిళలు సంప్రదాయబద్ధంగా జరుపుకొంటారు. గౌరీదేవికి పూజలు చేసి అట్లను ఆడపడుచులకు, బంధువులకు వాయినాలు ఇస్తారు. మండలలోని మంగళవారం మహిళలు అట్లతద్దిని ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయం నుంచి ఉపవాసం ఉండి సాయంత్రం వాయినాలు, దేవునికి నైవేద్యాలు పూర్తి చేసుకుని గోవులకు ప్రత్యేక పూజలు చేశారు. స్థానికంగా ఉన్న చెరువులు, కాలువలు వద్ద దీపాలు వెలిగించి పూజలు చేశారు. చెట్లకు ఉయ్యాల కట్టుకుని పాటలు పాడుతూ ఊగారు. చిన్న పెద్ద తేడాలేకుండా మహిళలు అందరూ ముందురోజు గోరింటాకు పెట్టుకుని తదియ నాడు కొత్త వస్త్రాలు ధరించి ఆటపాటలతో ఆహ్లాదంగా గడిపారు.

ముత్తయిదువులకు వాయినాలు

పెళ్లి కానివారికి గుణవంతుడైన భర్త రావాలని, పెళ్లయిన వారికి పండంటి బిడ్డ కలగాలని సౌభాగ్యంతో ఎల్లకాలం వర్ధిల్లాలని గౌరీదేవిని పూజించారు. నవగ్రహాలలో ఒకటైన కుజుడుకి అట్లంటే మహా ప్రీతి ఆయనకు అట్లను నైవేద్యంగా పెట్టి భక్తిశ్రద్ధలతో పూజించి అనంతరం 11 మంది ముత్తయిదువులకు 11 అట్లు, పండ్లు, పసుపు–కుంకుమ అందజేసి వారి దీవెనలు పొంది వాయినాలను సమర్పించారు.


కాలువ ఒడ్డున గౌరీదేవికి పూజలు చేస్తున్న మహిళలు

పిఠాపురం: అతివల ఐదోతనానికి ప్రతీకగా చెప్పబడే అట్లతద్దిని మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. తెల్లవారుజామున భోజనాలు చేసి నోము ప్రారంభించిన అతివలు రోజంతా ఉపవాసం ఉండి సాయంత్రం గౌరీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తగా పెళ్లైన నవ వధూవరుల జీవితం సుఖ సంతోషాలతో ఉండాలని కోరుతూ ముత్తైదువులకు అట్లను వాయినంగా ఇచ్చారు. సాయంత్రం చెరువులు, బావుల వద్ద వెళ్లి గౌరీదేవికి పూజలు చేశారు. అనంతరం గ్రామాల్లో ఉన్న దేవాలయాలకు వెళ్లి పూజలు నిర్వహించడంతో ఆలయాలు కిటకిటలాడాయి. పిఠాపురంలో వేంచేసియున్న శ్రీకుక్కుటేశ్వర స్వామి వారి ఆలయంలో పురూహూతికా అమ్మవారికి, రాజరాజేశ్వరీదేవికి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సామర్లకోట పట్టణ, మండలంలో..

సామర్లకోట: పట్టణ, మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో అట్లతద్ది వేడుకలు మంగళవారం ఉత్సాహంగా జరిగాయి. యువకులు తెల్లవారుజామున ఉప్పు పొట్లాలు తిప్పుతూ అట్లతద్దోయ్, ఆరోట్లోయ్, ముద్దపప్పోయ్ మూడట్లోయ్ అంటూ మహిళలను నిద్ర లేపారు. తెల్లవారుజామున మహిళలు గోంగూర పచ్చడి, పెరుగుతో భోజనాలు చేసి, ఉపవాస దీక్ష చేశారు. మహిళలు గోరింటాకు పెట్టుకున్నారు. ఉయ్యాలలు వేసుకుని మహిళలు సందడి చేశారు. అట్లు వేసుకుని ముతైదువులకు అట్ల వాయినాలు ఇచ్చారు. మహిళలు చెరువులు, గోదావరి కాలువ వద్ద గౌరీదేవికి పూజలు చేసి, దీపాలను వెలిగించారు. సామర్లకోట పంచారామ క్షేత్ర ముఖద్వారం వద్ద ఉన్న గోదావరి కాలువ స్నానాల రేవు వద్ద మహిళల సందడి నెలకొంది.

పెద్దాపురంలో..

పెద్దాపురం: పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో మంగళవారం అట్లతద్దె పండగను మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకొన్నారు. వేకువజామున అభ్యంగన స్నానాలాచరించి, ప్రత్యేక పూజలు చేశారు. కట్టమూరు, పులిమేరులోని గౌరీదేవి ఆలయాల్లో మహిళలు నోములు నిర్వహించారు. కొత్త పెళ్లికూతుళ్లకు వాయినాలు తీర్చి, గౌరీదేవిని పూజించారు. ముత్తయిదువులకు అట్లను వాయినాలుగా ఇచ్చారు. పంటలు సుభిక్షంగా ఉండాలని వరి దుబ్బులతో పూజించి, వివిధ రకాల పత్రులతో గౌరీదేవిని అలంకరించారు. యువతులు, చిన్నారులు ఉయ్యాలల్లో ఊగుతూ సందడి చేశారు.

ప్రతిఒక్కరూ నిజాయితీతో మెలగాలి


ప్రతిజ్ఞ చేస్తున్న ఏపీఎం, బ్యాంక్ సిబ్బంది

పెద్దాపురం: ప్రభుత్వ అవినీతి రహిత పాలన నేపథ్యంలో ప్రతిఒక్కరూ నిజాయితీగా మెలగాలని కాకినాడ జిల్లా డీఆర్‌డీఏ ఏపీఎం ఎస్.వేదకుమారి అన్నారు. స్థానిక మెయిన్ రోడ్డు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్‌లో మంగళవారం బ్యాంక్ సిబ్బందితో కలిసి సత్యనిష్ఠ ప్రతిజ్ఞ చేశారు. సభకు బ్యాంక్ మేనేజర్ కె.శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఏపీఎం వేదకుమారి మాట్లాడుతూ అవినీతి నిర్మూలనకు ప్రభుత్వం, ప్రైవేట్ రంగాలతో పాటు ప్రతి పౌరుడు కృషి చేయాలన్నారు. రాజమహేంద్రవరం క్రెడిట్ మేనేజర్ వైవీ రత్నకుమార్ పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు చెల్లించిన రైతులకు రాయితీ


నవర సొసైటీ రైతులకు చెక్కులు అందజేస్తున్న అచ్చిరాజు

సామర్లకోట: సొసైటీల నుంచి రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించిన రైతులకు ప్రభుత్వం నుంచి మూడు శాతం రాయితీ రూ.13,51,567 వచ్చినట్టు నవర సొసైటీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు తెలిపారు. పవర గ్రామంలో ఉన్న సొసైటీ కార్యాలయంలో రైతులకు చెక్కులను అందజేశారు. సొసైటీ పరిధిలో 1,140 మంది రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించడంతో, వారికి ఈ రాయితీ వచ్చినట్టు చెప్పారు. రైతులకు రాయితీ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు నాగనబోయిన రాజబాబు, మండపాక దొరబాబు, సొసైటీ సీఈఓ వీరంరెడ్డి కామేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

రెండు నుంచి ధర్మప్రచార వారోత్సవాలు

సామర్లకోట: దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు స్థానిక పంచారామ క్షేత్రం ఆధ్వర్యంలో ఈ నెల రెండు నుంచి ధర్మప్రచార వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఈఓ డి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సనాతన హిందూ ధర్మ పరిరక్షణ కోసం వారం రోజుల పాటు, రోజుకో గ్రామంలో సాయంత్రం 5 నుంచి వేద పారాయణ, సామూహిక కుంకుమార్చనలు, భజనలు, కోలాటం వంటి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. 2న ఉండూరు, 3న గొంచాల, 4న కాపవరం, 5న వేట్లపాలెం, 6న హుస్సేన్‌పురం, 7న వీకే రాయపురం, 8న నవరలో కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

ఆదాయ వనరులపై దృష్టి

- కౌన్సిల్ సమావేశంలో అధికార పక్ష సభ్యుల డిమాండ్
- అజెండాలో నాలుగు అంశాలు వాయిదా

సామర్లకోట: మున్సిపల్ అధికారులు మున్సిపాలిటీకి ఆదాయం వచ్చే అంశాలపై దృష్టి సారించాలని అధికార పక్ష సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. కొనేళ్లుగా రైల్వేకు మున్సిపాలిటీ తాగునీరు ఇస్తోందని, దానికి రూ.73 లక్షల వరకూ బకాయిలుండగా, వారికి డిమాండ్ నోటీసులు ఇవ్వలేదని సభ్యులు చల్లపల్లి వెంకటసత్యనారాయణ (లాయర్ శ్రీను), నేతల హరిబాబు ఆరోపించారు. రైల్వే నుంచి కుళాయి పన్నులుగా రూ.25 లక్షలు చెల్లించారని ఏఈ అరవింద్ తెలిపారు. బీపీఎస్ నిధులు రూ.79 లక్షలు రావాల్సి ఉండగా, వాటిని ఏం చేశారని, గతంలో సూచించిన అనధికార కుళాయిలకు పన్నులు ఎందుకు వేయలేదని ఆ సభ్యులు ప్రశ్నించారు. గత నెల 12న ముఖ్యమంత్రి సామర్లకోట వచ్చిన సందర్భంగా మున్సిపాలిటీ నుంచి కౌన్సిలర్ల ఫోటోలతో ప్రకటన ఎందుకు వేయించలేక పోయారని పితాని కృష్ణ, ఆవాల లక్ష్మీనారాయణ, కరణం రాజ్‌కుమార్, నేతల హరిబాబు ప్రశ్నించారు. ప్రకటన ఇవ్వాలని చెప్పానని చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ తెలిపారు. కౌన్సిలర్లకు గుర్తింపు ఉండేలా జగనన్న కాలనీ ముఖద్వారం వద్ద శిలాఫలకం ఏర్పాటు చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు. దీనిని జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకువెళతామని కమిషనర్ జె.రామారావు హామీ ఇచ్చారు. జగనన్న కాలనీలో జరిగిన పనుల అంచనాలు అధికంగా తయారు చేశారని ఆరోపిస్తూ అజెండాలోని నాలుగు అంశాలను వాయిదా వేయాలని అధికార పక్ష సభ్యులు సూచించారు. మిగిలిన అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.


అధికారుల తీరును ప్రశ్నిస్తున్న సభ్యులు


సభ్యులకు సమాధానం ఇస్తున్న చైర్‌పర్సన్ అరుణ, ఏఈ అరవింద్

అభివృద్ధి పనుల జాప్యం

ప్రజా సమస్యలపై చర్చించడానికి జీరో అవర్ ఇవ్వాలని సభ్యుల సూచన మేరకు ప్రతి సభ్యుడికి మూడు నిమిషాల అవకాశం ఇస్తున్నట్టు చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ ప్రకటించారు. కౌన్సిల్ ఆమోదం పొంది, నిధులు విడుదలైనా పనులు జరగడం లేదని సభ్యులు పిట్టా సత్యనారాయణ, పిల్లాడి సత్యవతి, ఆవాల లక్ష్మీనారాయణ, నేతల హరిబాబు, స్వయంభారపు వీరభద్రరావు, ఎస్.సురేష్, పాగా సురేష్ ఆరోపించారు. ×గడప గడపకూ౯లో మంజూరైన నిధులు ప్రాధాన్య క్రమంలో చేయడం లేదన్నారు. గడువులోగా పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని వైస్‌చైర్మన్ ఉబా జాన్‌మోజెస్ సూచించారు. పట్టణ పరిధిలో పారిశుధ్య అధ్వానంగా ఉంటుందని సభ్యులు రెడ్డి లోవకుమారి, పాలిక కుసుమ, పెండ్యాల వెంకటలక్ష్మి, పిల్లాడి సత్యవతి, పిట్టా సత్యనారాయణ, పాగా సురేష్‌కుమార్ ఆరోపించారు. పనులు చేయని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ సూచించారు. ఓటీఎస్ పథకంలో సొమ్ము చెల్లించినా, అనేక మందికి పట్టాలు రాలేదని హరిబాబు ఆరోపించారు. స్థానిక స్టేషన్ సెంటర్‌లో రిక్షా స్టాండ్ స్థలం ఆక్రమణకు గురైందని చెప్పారు. అనేక పబ్లిక్ కుళాయిల నుంచి తాగునీరు వృథాగా పోతోందని సభ్యులు ఆరోపించారు.

ఘనంగా వీరభద్రుని జన్మదిన వేడుకలు


పట్టువస్త్రాల అలంకరణలో వీరభద్రస్వామి

సామర్లకోట: భక్తిశ్రద్ధలతో వీరభద్రుని జన్మదిన వేడుకలను మంగళవారం నిర్వహించారు. స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో ఉన్న వీరభద్రుని ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. స్వామి వారిని పట్టు వస్త్రాలతో అలంకరించారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, కొంతేటి జోగారావు, సన్నిధిరాజు వెంకన్న, శ్రీకాకుళపు వినయ్ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రజల ఆరోగ్యమే 'సురక్ష' లక్ష్యం


రోగులకు కిట్లు అందజేస్తున్న చైర్‌పర్సన్ అరుణ


ఉప్పాడలో జగనన్న ఆరోగ్య సురక్షలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ

సామర్లకోట: ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు. స్థానిక పెన్షన్‌లైన్ సచివాలయం వద్ద మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష జరిగింది. ఆమె మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష క్యాంప్‌లో అవసరమైన వారికి కార్పొరేట్ వైద్యం అందిస్తారని చెప్పారు. శిబిరంలో 360 మందికి వైద్య సేవలందించిన్నట్లు ఆరోగ్య మిత్ర బంగారుశ్రీ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, వైద్యులు సంజీవ్, తిరుమలాదేవి, జ్యోతి, భవ్య, హేమంత్ సేవలందించారు. మాజీ కౌన్సిలర్ గంగిరెడ్డి కృష్ణమూర్తి, పార్టీ నాయకులు, మున్సిపల్, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉప్పాడలో జగనన్న ఆరోగ్య సురక్ష

కొత్తపల్లి: ఉప్పాడ గ్రామ సచివాలయం–4 వద్ద మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మౌనిక ఆధ్వర్యం 451 మందికి పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యూట్రిషన్ స్టాల్‌ను ఎంపీడీఓ పి.వెంకట నారాయణ, ఈఓపీఆర్డీ భాస్కరరావు, కార్యదర్శి శ్రీనివాస్ పరిశీలించారు.

జీపీఎస్ వాహనాలకే అనుమతి

కరప: సార్వా సీజన్‌లో ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైసు మిల్లులకు చేరవేసేందుకు వాహనాలకు జీపీఎస్ తప్పనిసరిగా చేయించుకోవాలని ఎంఏఓ ఏపీ రాజేష్ తెలిపారు. కరప, పెనుగుదురు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల వద్ద మంగళవా°ం రవాణా చేసేందుకు ముందుకువచ్చిన ట్రాక్టర్లు, ఇతర వాహనాలకు జీపీఎస్ చేసి, యజమానుల వివరాలు సేకరించారు. సోమ, మంగళవారాల్లో మండల పరిధిలో గుర్తించిన 122 వాహనాలకు జీపీఎస్ చేశామని ఆయన తెలిపారు. రైతుల నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని జీపీఎస్ చేసిన వాహనాల ద్వారా రైసుమిల్లులకు చేరవేస్తామని ఎంఏఓ రాజేష్ తెలిపారు.

నియామక ఉత్తర్వులు అందజేత

కాకినాడ సిటీ: కాకినాడ జిల్లాలో పోషణ అభియాన్‌లో కాంట్రాక్ట్ పద్ధతిపై పని చేసేందుకు నిర్వహించిన పలు పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు నియామక ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ సాధికారత అధికారిణి కె.ప్రవీణలతో కలిసి మంగళవారం అందజేశారు. జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ పోస్టును, జిల్లా ప్రాజెక్టు అసిస్టెంట్ పోస్టు, బ్లాక్ కోఆర్డినేటర్లు పోస్టులను జగ్గంపేట, శంఖవరం ప్రాంతాలకు ఎంపిక చేసినట్టు చెప్పారు.

ఓటర్ల జాబితా ప్రక్రియకు సహకరించాలి

పెద్దాపురం: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో చేపట్టే ఓటర్ల జాబితా ప్రచురణ ప్రక్రియకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని పెద్దాపురం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జేఎస్ రామారావు కోరారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం ఈ అంశంపై వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితా రీ సర్వే కార్యక్రమం మరింత వేగవంతంగా చేపట్టినట్టు పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలపై ప్రజా ప్రతినిధులు మరింత అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఓటరు జాబితాపై అపోహలు తొలగించడానికి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఈ నెల 27న ఓటరు డ్రాఫ్ట్ ప్రచురణ పూర్తయిందన్నారు. నియోజకవర్గ పరిధిలో 2,08,930 మంది ఓటర్లు ఉన్నారని, పురుషులు 1,03,001, స్త్రీలు 1,05,916, ఇతరులు 13 మంది ఉన్నట్టు వివరించారు. అనంతరం ప్రజాప్రతినిధుల సూచనలను స్వీకరించారు. సమావేశంలో పెద్దాపురం తహసీల్దార్ వి.జితేంద్ర, మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, మేనేజర్ జ్యోతిరాణి, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు(వైఎస్సార్ సీపీ), రంధి సత్యనారాయణ (టీడీపీ), చింతా శ్రీనివాసరావు (వైఎస్సార్ సీపీ)లతో పాటు వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు

ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి


భారతదేశ పటం ఆకారంలో ఉన్న విద్యార్థులు

కొత్తపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో భారతరత్న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రాపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం సాధించాలనే నినాదంతో దేశాన్ని ఏకంచేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.వెంకటనారాయణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, వాకతిప్ప సర్పంచ్ పాలని దొరబాబు, పలు శాఖల అధికారులు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మూలపేటలో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. పటేల్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థులు భారత పాఠాం ఆకారం, చేతులు కలిపి మానవహారం చేశారు.


పటేల్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం


పటేల్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ ఓటు హక్కు

- జనవరి 5న ఓటర్ల తుది జాబితా
- ఈఆర్వో నాగనరసింహారావు

కాకినాడ: ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నదే లక్ష్యమని కాకినాడ సిటీ నియోజకవర్గ ఈఆర్వో, కార్పొరేషన్ కమిషనర్ నాగనరసింహారావు స్పష్టం చేశారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈఆర్వో నాగనరసింహారావు మాట్లాడుతూ సిటీ పరిధిలో 14,214 ఓట్లను తొలగించినట్టు తెలిపారు. ఇందులో మరణించిన ఓటర్లు 7 వేలు, డబుల్ ఎంట్రీ ఓటర్లు రెండు వేలు, ఇతర నియోజకవర్గాలకు వెళ్లిపోయిన ఓటర్లు 4 వేలు ఉన్నాయని వివరించారు. ఈసీ మార్గదర్శకాలకు అనుగుణంగానే కొత్త ఓటర్ల నమోదు స్వీకరణ నుంచి మార్పులు, చేర్పులు, తొలగింపులు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఆచూకీలేని (నాన్ ట్రేస్) ఓటర్లకు సంబంధించి పోస్టల్ ద్వారా రిజిస్టర్డ్ పోస్టులో నోటీసులు పంపించామని, తిరిగి వచ్చిన నోటీసులను మరోసారి బీఎల్‌వోలు ద్వారా పునర్విచారణ చేసి నిర్ణయం తీసుకుంటామన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాగనరసింహారావు

నాలుగు రోజుల ప్రత్యేక శిబిరాలు

ఓటు నమోదు, మార్పులు, చేర్పుల కోసం నవంబర్ 4, 5, డిసెంబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్టు ఈఆర్వో నాగనరసింహారావు చెప్పారు. ఆ శిబిరాల్లో ఫారం–6, 7, 8లకు సంబంధించి చేసుకునే దరఖాస్తులను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇప్పటికే ఓటర్ల ముసాయిదా జాబితాను ప్రచురించామన్నారు. కాకినాడ సిటీ పరిధిలోని 233 పోలింగ్ స్టేషన్లు, ఈఆర్వోలు, కార్పొరేషన్ కార్యాలయంలో ముసాయిదా జాబితా అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఓటర్ల తుది జాబితాను 2024 జనవరి 5న ప్రచురిస్తారని వెల్లడించారు. ఓటర్ల సర్వే ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఏఈ ఆర్వో, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎంవీ మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ ప్రతినిధి రావూరి వెంకటేశ్వరరావు, టీడీపీ ప్రతినిధి ఒమ్మి బాలాజీ, బీఎస్పీతో పాటు వివిధ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు.